సాక్షి సంగారెడ్డి

గురువారం । 15 । ఆగస్టు । 2024

మది నిండా దేశభక్తి..

దేశభక్తిలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకతను చాటుకుంటోంది. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని నేటికీ చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

పంద్రాగస్టు వేడుకల వేళ ప్రత్యేక కథనాలు IIలో..



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం సంగారెడ్డి కోర్టులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌లో, ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీస్ ప్యూన్ లలో రెండు చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లా కోర్టు వెబ్‌సైట్ http//sangareddycourt.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో..

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్లలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషినిస్ట్, మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్, డ్రాఫ్‌మెన్, సివిల్, ఎలక్ట్రిక్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ, వెల్డర్, మెకానిక్ డీజిల్ ట్రేడర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. http//iti.teanfana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్ నమోదు చేసుకోవాలన్నారు.

నేడు సంగారెడ్డికి మంత్రి రాక

సంగారెడ్డి టౌన్ : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ హాజరకానున్నట్లు కలెక్టర్ క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఉత్తమంగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారని చెప్పారు.

రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని రీజినల్ మేనేజర్ ప్రభులత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు ఆరురోజుల పాటు అదనంగా 265 బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండ్లలో రద్దీని పర్యవేక్షిస్తూ ఆయా రూట్లలో బస్సులు నడుపుతామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేయడంపై హర్షం

సంగారెడ్డి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు వెలువరించడంపై టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర విభజన ప్రక్రియల్లో భాగంగా కమలనాథన్ కమిటీ సిఫారసుల మేరకు తెలంగాణ ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారని చెప్పారు. అక్కడే ఏళ్లుగా పనిచేస్తూ ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. వారిని సొంతగడ్డకు రప్పించేందుకు టీఎన్జీఓ కేంద్ర సంఘం అలుపెరగని పోరాటం చేసిందన్నారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని సారథ్యంలో నాయకులు ఏపీకి వెళ్లి అక్కడి సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో చర్చించారని వివరించారు. దీంతో ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తెలంగాణ ఉద్యోగులను సొంత ఏపీ నుంచి పంపిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారని హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రత పాటించాలి

ఝరాసంగం(జహీరాబాద్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రత్నాకర్ సూచించారు. మండల పరిధిలోని మేదపల్లిలో డెంగీ కేసు నమోదుకావడంతో బుధవారం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య, ఏపీఓ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కాంచన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



వివిధ శాఖల స్టాల్స్ కోసం ఏర్పాటు చేసిన మండపాలు

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో 78వ స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందుకోసం ఎస్పీ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌ను అధికారులు ముస్తాబు చేశారు. వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు. వేడుకలకు మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా రానున్నట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రౌండ్ పరిసరాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. – సంగారెడ్డి:

మరో అడుగు..!

- మంజీరా అభయారణ్యానికి రాంసర్ గుర్తింపు దిశగా కసరత్తు
- ప్రతిపాదనలు పంపామన్న స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ
- ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఉన్నతాధికారుల బృందం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మంజీరా అభయారణ్యానికి ప్రపంచ స్థాయి రాంసర్ గుర్తింపు దిశగా మరో అడుగు పడింది. జీవవైవిధ్యం ఉన్న ఈ అభయారణ్యంలోని చిత్తడి నేలలను రాంసర్‌గా గుర్తించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపామని స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారిణి ప్రశాంతి ప్రకటించారు. బుధవారం ఈ అభయారణ్యాన్ని ఉన్నతాధికారుల బృందం సందర్శించింది. మంజీరా నదిలో ఉన్న మొత్తం తొమ్మిది దీవులను బోటులో వెళ్లి పరిశీలించారు. ఈ అభయారణ్యానికి రాంసర్‌గా గుర్తిస్తే ఈ ప్రాంతం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. అలాగే యునెస్కో గుర్తింపును కూడా దక్కించుకునేందుకు రాష్ట్ర అటవీశాఖ ప్రయత్నాలు చేస్తోందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

మంజీరా డ్యాం సమీపంలో..

సంగారెడ్డి మండలం మంజీరా డ్యాం సమీపంలో ఉన్న ఈ అభయారణ్యంలో మొసళ్ల వంటి జలచరాలతో పాటు, వందల రకాల పశు పక్షాదులు నివాసముంటున్నాయి. ప్రత్యేకంగా విదేశీ పక్షులు కూడా ఈ ప్రాంతానికి వలస వస్తుంటాయి. ఈ చిత్తడి నేలలు ఎంతో జీవవైవిధ్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఈ ప్రాంతానికి రాంసర్ గుర్తింపు కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఈపీటీఆర్ఐతో కలిసి అధ్యయనం

ఈ ప్రాంతానికి రాంసర్ గుర్తింపు లభించేందుకు రాష్ట్ర అటవీశాఖ ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)తో కలిసి అధ్యయనం చేస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా రెండు రోజుల వర్క్‌షాప్ హైదరాబాద్‌లో జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు బుధవారం ఫీల్డ్ విజిట్‌కు వచ్చారు. ఈ అభయారణ్యానికి సంబంధించిన ప్రత్యేకతలు, పూర్తి వివరాలు, సాంకేతిక పరమైన అంశాలతో కూడిన ప్రాథమిక నివేదికను అటవీశాఖ ఇప్పటికే నేషనల్ వెట్‌ల్యాండ్ (జాతీయ చిత్తడి నేలల) బోర్డుకు పంపారు.



మంజీరా నదిలో బోటులో మంజీరా అభయారణ్యాన్ని సందర్శిస్తున్న వెట్‌ల్యాండ్ అథారిటీ అధికారులు

ప్రణాళికలు సిద్ధం

మంజీరా బ్యారేజ్ సమీపంలో ఉన్న అభయారణ్యాన్ని రాంసర్ అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్లు స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారిణి ప్రశాంతి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సౌభాగ్యత మిషన్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారని, ఇందులో భాగంగా ఈ స్టడీ టూర్‌కు వచ్చామని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను వారు తిలకించింది. కేంద్ర బృందం సభ్యులు కీర్తి మానవస్తీ, కల్వేరసన్, డాక్టర్ జాన్సెమాత్యు, వికాస్ చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రంసింగ్, రాంబాబు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఎఫ్ఓ శ్రీధర్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంజీరా డ్యాం వద్ద ఉన్నతాధికారుల బృందం

నాలుగు మండలాల పరిధిలో..

ఈ అభయారణ్యం సంగారెడ్డి, సదాశివపేట, పుల్కల్, చౌటకూర్ మండలాల పరిధిలోని సుమారు 20 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉంది. ఇందులో 303 రకాల పక్షులు నివాసముంటాయని అటవీశాఖ గుర్తించింది. ఇందులో సుమారు 140 జాతుల పక్షులు నివాసముంటున్నాయి. కొన్ని హిమాలయాలను దాటుకొని ఇక్కడికి వలస వస్తాయి. వేసవి, వర్షాకాలం రెండు సీజన్లలో విదేశీ పక్షులు వలసవచ్చి వెళుతుంటాయి. ఇందులో పెంటెడ్ షార్క్, ఫ్లెమింగో, బార్‌హెడెడ్‌గూస్ వంటి రకాల పక్షులు సంచరిస్తుంటాయి. మొసళ్లు వంటి 14 రకాల ఉభయచరాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. సుమారు 57 జాతులకు చెందిన చేపలు, 32 రకాల సీతాకోకచిలుకలు ఇక్కడ కనిపిస్తుంటాయి. దీనికి రాంసర్ గుర్తింపు లభిస్తే ఈ ప్రాంతాన్ని మరింత జీవవైవిధ్యంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయని, అంతర్జాతీయ పక్షి ప్రేమికులు, పర్యాటకుల సందడి పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

మోదీ పాలనలోనే దేశం సురక్షితం



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల

ఎంపీ ఈటల రాజేందర్

జహీరాబాద్: పరమత సహనం భారతీయ సంస్కృతిలో ఉందనడానికి 77 ఏళ్ల స్వతంత్ర భారత దేశమే సజీవ సాక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో విభజన గాయాల స్మారక దినం ఆత్మీయ సన్మాన సభ నిర్వహించి వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సంగ్రామంలో ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలు మరవలేనివన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని, సమాన అవకాశాలు, చట్టాలు కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నేడు 5వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, రానున్న రోజుల్లో మూడో స్థానానికి చేరుకుంటుందన్నారు. 25కోట్ల మంది ప్రజలు దారిద్య్రరేఖ దిగువ నుంచి పైకి ఎదిగారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు అంజిరెడ్డి, జి.భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, జగన్ పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం' నిరంతరం కొనసాగాలి

సంగారెడ్డి టౌన్ : 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమం నిరంతరం కొనసాగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతి జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా నిరంతరం ఫాగింగ్ చేయించాలన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్, పంచాయతీ అధికారి సాయిబాబా, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

నష్టం కలగకుండా విస్తరణ పనులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి

పటాన్‌చెరు : పట్టణంలో వ్యాపారులు, స్థానికులకు నష్టం వాటిల్లకుండా జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ఆయన పటాన్‌చెరులో పర్యటించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ పుర ప్రముఖులు, అధికారులతో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు చేపడుతున్న ఆరు వరుసల హైవే విస్తరణ పనుల కారణంగా స్థానికులకు నష్టం కలగకుండా ఫ్లై ఓవర్ నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.



విస్తరణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్, ఎమ్మెల్యే

వరినాట్లకు వలస కూలీలు

బయటి రాష్ట్రాల నుంచి మగ కూలీలు రాక

- రెండు నెలలు ఇక్కడే మకాం
- ఎకరాకు రూ.4,300 కూలి
- జిల్లాలో వరిసాగు విస్తీర్ణం 1.41లక్షల ఎకరాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జిల్లాలో వానాకాలం సీజన్ వరి నాట్లు నెల రోజులుగా జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, బోర్లలో సమృద్ధిగా నీరు చేరడంతో రైతులు వరి పంటను అధికంగా సాగు చేస్తున్నారు. వ్యవసాయానికి కూలీల సాయం తప్పనిసరి. అయితే స్థానికులు ఎక్కువ మంది పరిశ్రమల్లో పనులకు వెళ్తుండటంతో వ్యవసాయానికి కూలీల కొరత ఏర్పడుతుంది. దీంతో వరినాట్లు వేసేందుకు రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. అలా వచ్చినవారు రెండు నెలలు ఇక్కడే మకాం వేసి సాగు పనులు చేస్తున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మగ కూలీలు అధికంగా వస్తున్నారు. ఒక బృందంగా ఏర్పడి వరినాట్లు వేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1.41లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ఒక్కో గ్రామానికి 30 నుంచి 40 మంది వలస కూలీలను తీసుకొస్తున్నారు. ఒక్కో షెడ్‌లో 15 నుంచి 25 మంది ఉంటున్నారు. వారి కోసం లేబర్ కాంట్రాక్టర్ స్థానికంగా షెడ్లు ఏర్పాటు చేసి వంట చేసుకోవడానికి గ్యాస్ సిలిండర్లు, బియ్యం ఏర్పాటు చేస్తుంటాడు. కూలీలు కూరగాయలు తెచ్చుకొని వంట చేసుకొని ఉదయం 5గంటలకే పొలానికి వెళ్తారు. ఒక్కో కూలీల బృందం రోజుకు 4 ఎకరాల నుంచి 6 ఎకరాల వరకు నాటు వేస్తారు. ఖర్చులు పోను రెండు నెలల్లో ఒక్కో కూలీ రూ.30వేల నుంచి రూ.40వేల వరకు సంపాదిస్తున్నారు. అయితే లేబర్ కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న వ్యక్తి ఎకరాకు వంద నుంచి రెండు వందల రూపాయల వరకు కమిషన్ తీసుకుంటున్నాడు.

వలస కూలీలకే తక్కువ..

మన కూలీలతో పోల్చితే వలస కూలీలకు ఇచ్చే కూలి తక్కువే. స్థానిక కూలీలకు ఎకరం పొలం నాటువేస్తే రూ.7వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. వరినారు అందించే కూలీకి అదనంగా చెల్లించాలి. ఇక్కడి కూలీలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకే పనిచేస్తారు. వలస కూలీలకు ఎకరం పొలం నాటు వేస్తే రూ 4,300 చెల్లిస్తే చాలు నారు కూడా వారే వేసుకుంటారు. దీంతో రైతుకు ఎకరానికి రూ.3వేలు ఆదా అవుతుందని పేర్కొంటున్నారు.

ఈ రాష్ట్రాల నుంచి అధికంగా..

బతుకుదెరువు కోసం జిల్లాకు వలస కూలీలు అధికంగా వస్తుంటారు. ప్రతీఏడాది కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింధనూర్ నుంచి, ఉత్తరప్రదేశ్ రాంపూర్ జిల్లా రుద్రాపూర్ అలాగే బీహార్ రాష్ట్రం నుంచి వరినాట్లు వేసేందుకు వస్తారు.



సదాశివపేట మండలంలోని వెంకటాపూర్ శివారులో వరి నాట్లు వేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

మా రాష్ట్రంలో పనులు దొరకవు



మా రాష్ట్రంలో వర్షాకాలంలో పనులు తక్కువ ఉంటాయి. కూలి రేట్లు కూడా తక్కువగానే ఉంటాయి. అందుకే వరినాట్లు వేసేందుకు ఇక్కడికి వస్తున్నాం. ఖర్చులు పోను రెండు నెలల్లో రూ.30వేల నుంచి రూ.40వేల వరకు సంపాదిస్తాం.

– దేవ్, కూలీ, ఉత్తరప్రదేశ్

వలస కూలీలతో డబ్బు ఆదా



వరి నాట్లకు స్థానికంగా కూలీల కొరత ఉంది. వలస కూలీలపై ఆధారపడుతున్నాం. మన కూలీలు ఎకరానికి రూ.7వేలు తీసుకుంటారు. సాయంత్రం దావత్‌కు అదనంగా డబ్బులివ్వాలి. దీంతో కూలీల ఖర్చు ఎక్కువవుతోంది. వలస కూలీలకు ఎకరానికి రూ.4300 ఇస్తే సరిపోతుంది. ఇలా ఎకరానికి 3వేలు మిగులుతాయి.

– ఇందూరి బాబు, రైతు కంభాలపల్లి

వైద్యురాలిపై అత్యాచార ఘటన దారుణం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులు

సంగారెడ్డి : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచార ఘటనపై సంగారెడ్డి మెడికల్ కాలేజీ విద్యార్థులు నిరసన తెలిపారు. మెడికల్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కొందరు నిందితుడిని కేసు నుంచి తప్పించేందుకు కుట్రలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

జహీరాబాద్ టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని.. వంటశాల, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. కోహీర్ మండలం కవేలి ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ మధ్యాహ్న భోజనం, వంటగది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. నిలువ ఉంచిన గుడ్లను విద్యార్థులకు ఇవ్వకూడదన్నారు. పాఠశాల గదులు, వంటశాల చీకటిగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు సూచించారు. అలాగే ఉన్నత పాఠశాలను సందర్శించి టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈఓ ఎస్.శంకర్, హెచ్ఎంలు ఎలిజిబెత్, దొండిరావు, సీఆర్పీ కిషన్ ఉన్నారు.



మదినిండా దేశభక్తి ఎల్లెడలా కీర్తి

వారందరిలో జాతీయ భావం ఉట్టిపడుతోంది.. దేశభక్తి తొణికిసలాడుతోంది. వెరసి ఉమ్మడి మెదక్ జిల్లా మురిసిపోతోంది. ఊరూరా ప్రత్యేకతను చాటుతోంది. ఊరు చిన్నది.. దేశభక్తిలో పెద్దది అన్న రీతిలో కీర్తిని సాధిస్తున్నాయి. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాలకు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. శ్రమైక జీవనంతో ముందడుగు వేస్తున్నాయి. కొన్నేళ్లుగా కొన్ని గ్రామాల్లో మద్యం ముట్టడంలేదు.. మిరుదొడ్డి మండలంలో 43 ఏళ్లుగా జాతీయ జెండాను నిరంతరం ఎగురుతూ ఉండటం గ్రామస్తుల్లో ఉన్న దేశభక్తికి నిదర్శనం. ఇలా ప్రతి గ్రామం ప్రత్యేకతను చాటుతుండటం విశేషం.

అదృష్టంగా భావిస్తున్నా..


గాంధీరెడ్డి

నేను అక్టోబర్ 2 గాంధీ జయంతిన పుట్టాను. అమ్మానాన్న ఆ మహాత్ముడిపై ఇష్టం దీంతో నా పేరు గాంధీరెడ్డి అని పెట్టారు. మా ఊరు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం దుబ్బాక మండలం పోతారం. ఇప్పుడు నా వయస్సు 51 ఏళ్లు. నేను ఎక్కడికి పోయినా అందరూ గాంధీరెడ్డి అంటూ ప్రత్యేకంగా పిలుస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. గాంధీరెడ్డి అనే పేరు మా చుట్టుపక్కల ఎవ్వరికీ లేదు. నాదే స్పెషల్ అంటూ అందరూ మాట్లాడుతుంటుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఏటా అక్టోబర్ 2న బర్త్ డే జరుపుకుంటాను. ఆగస్టు 15న ఏటా స్వాతంత్య్ర దినోత్సవం రోజున జరిగే వేడుకల్లో ప్రత్యేకంగా పంచెకట్టుకొని పాల్గొనడం ఇష్టం.

– దుబ్బాక

నెహ్రూ అంటే.. ఆ ఫీలింగే వేరు



మా నాన్నకు జవహర్ లాల్ నెహ్రూ అంటే చాలా ఇష్టం. ఆ పేరును నాకూ పెట్టారు. నెహ్రూ అని పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. మా ఫ్రెండ్స్ నెహ్రూ అని పిలుస్తుంటే ఆ ఫీలింగ్ వేరులా ఉంటుంది. రేగోడ్(మెదక్):

– నెహ్రూ, యువజన సంఘం నాయకుడు

బీదర్ చౌరస్తా.. అమర జవాన్‌ల చౌక్



జహీరాబాద్ టౌన్: దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమర జవానుల జ్ఞాపకార్థం పట్టణం సమీపంలో బీదర్ చౌరస్తాలో కొంత మంది యువకులు, మాజీ సైనికులు కలిసి స్మారక స్తూపం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి విస్తర్ణంలో భాగంగా చౌరస్తాలో కొంత స్థలం ఉండగా అక్కడ నాలుగేళ్ల క్రితం స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసి అమరులకు నివాళులర్పిస్తున్నారు. అప్పటి నుంచి బీదర్ చౌరస్తా అమర జవాన్‌ల చౌక్‌గా మారింది. స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు కార్గిల్ విజయ్ దివస్ తదితర సందర్భంల్లో మాజీ సైనికులు, యువకులు అరులకు నివాళులు అర్పిస్తున్నారు. స్మారక స్థూపం వద్ద మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం వారు అభివృద్ధి పనులు చేపట్టారు. స్తూపం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి పూల మొక్కలను నాటారు.


తున్కిఖాల్సా పల్లె ప్రకృతివనంలో 48 అడుగుల త్రివర్ణ పతాకం

48 అడుగుల జెండా

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా పల్లె ప్రకృతివనంలో 48 అడుగుల ఎత్తున జాతీయ జెండా ఏడాది పొడుగునా రెపరెపలాడుతూ అందరినీ ఆకట్టుకుంటుంది. 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల పొడవు కలిగి ఉంది. మాజీ సర్పంచ్ కటికె సంధ్యజానీ దంపతులు గ్రామానికి రూ.80 వేల సొంత ఖర్చులతో 2021 జనవరిలో ఏర్పాటు చేయించారు. 2021 జనవరి 26 రిపబ్లిక్ డే రోజున పతాకం ఆవిష్కరించారు. దీంతో యేటా స్వాతంత్య్ర దినోత్సవం, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రకృతివనంలో ఈ భారీ పతాకావిష్కరణ ఆనవాయితీగా కొనసాగుతోంది.

మద్యం ముట్టని గ్రామాలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండలం జంమ్గిలో 18 ఏళ్ల మద్యం నిషేధం అమలవుతోంది. 2006లో గ్రామపెద్దలతో చర్చించి మద్యం విక్రయిస్తే రూ.5 వేలు జరిమానా విధించాలని తీర్మానించారు. మద్యం విక్రయిస్తే రూ.5 వేలు జరిమానా విధిస్తున్నారు. నాటి నుంచి ఇప్పటివరకు గ్రామంలో మద్యపాన నిషేధం అమలు అవుతోంది. అసలు.. 2006లో పలువురు యువకులు మద్యం మత్తులో గ్రామ కూడలి వద్ద ఘర్షణ పడ్డారు. గ్రామస్తులు వారించి గొడవలకు కారణమవుతున్న మద్యం విక్రయాలను నిలిపివేసేం దుకు గ్రామ పెద్దలు ముందు కొచ్చారు.


జంమ్గి గ్రామ పంచాయతీ భవనం

అంబాజిపేట- పదేళ్లుగా..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేటలో పదేళ్లుగా మద్య నిషేధం అమలవుతోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించి గ్రామ పెద్దలను ఒప్పించి అమలులోకి తీసుకువచ్చారు. పదేళ్లకు ముందు గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహణకు వేలం ద్వారా పాట పాడి వైన్ షాపులు నడపడగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరిగాయి. మరోసారి షాప్ వేలం వేసేందుకు గ్రామపంచాయతీ వద్ద గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న మహిళ సంఘాల సభ్యులు ర్యాలీగా వెళ్లి వేలాన్ని అడ్డుకున్నారు. అప్పటి నుంచి మద్యం నిషేధాన్ని తీర్మానించారు.

వరిగుంతం కూడా పదేళ్లుగా..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం గ్రామం పదేళ్లుగా మద్య నిషేధానికి కట్టుబడింది. 2014 ముందు గ్రామంలో చిన్న కొట్టులో సైతం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిపారు. మద్యానికి ఆడ,మగ తేడా లేకుండా బానిసలై గ్రామంలో అశాంతి, అసాంఘిక కార్యక్రమాలు కొనసాగాయి. యువత మందుకు బానిసై రోజూ గొడవలు పడటం పరిపాటిగా మారింది. అయితే మత్తులో పాతికేళ్ల నిండని యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ సమయంలో షాపులను నియంత్రించేందుకు కొందరు యువకులు, మహిళా సంఘాల వారు ఒక్క తాటిపైకి వచ్చి మద్య నిషేధంపై పోరాడారు. 2014లో గ్రామంలో పూర్తి మద్య నిషేధం ప్రతిజ్ఞ, తీర్మానించారు. గ్రామ బహిష్కరణ కూడా తీర్మానించారు.

అల్లీపూర్.. మువ్వన్నెల జోర్

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాటంలో చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు ప్రత్యేకత ఉంది. గ్రామానికి చెందిన కిషన్ రావు నేతృత్వంలో ఉద్యమకారులు, గ్రామస్తులు కలిసి 1947 సెప్టెంబర్ 11న అల్లీపూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నిజాం పాలనలో తెలంగాణలో తొలిసారిగా జాతీయ పతాకం ఇక్కడే ఎగిరిందంటారు ఉద్యమకారులు. నాటి ఈ ఘటనకు ప్రతీకారంగా నిజాం సైన్యం దాడిలో ఉద్యమకారుడు లక్ష్మయ్య మృతిచెందాడు. అనంతరం గ్రామ ప్రజలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విషయం తెలియగానే నిజాం సైన్యం గ్రామానికి చేరుకుని 100 మందిని అరెస్టు చేసి ఔరంగాబాద్ జైలుకు తరలించారు. నాటి ఘటనకు గుర్తుగా బురుజు నిర్మించారు.


అల్లీపూర్‌లో బురుజు

అమ్మాయి పుడితే.. ఆనందమే వేరు


ఆడపిల్లలు పుట్టిన తల్లులకు రూ.5 వేలు అందజేసిన నీలం మధు(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: అమ్మాయి పుడితే భారంగా భావిస్తున్న రోజులవి...ఇలాంటి సమాజంలో ఆడపిల్ల పుట్టడం వరమంటున్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు చెందిన కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్. చిట్కుల్‌లో ఆడపిల్ల పుడితే రూ.5 వేలు ఇస్తానని గతేడాది మార్చిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినూత కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే 14 మంది ఆడపిల్లలు పుట్టిన తల్లులకు రూ.5 వేలు చొప్పున అందజేశారు.

గాంధీ స్ఫూర్తితో ఆపన్న హస్తం

కంగ్టి(నారాయణఖేడ్): చేతనైనంత సాయం చేసి పేదలకు ఆపన్న హస్తం అందించే నైజం ఆమెది. మాజీ సర్పంచ్ రాథోడ్ సురేఖ వెంకట్‌కు గిరిజన తండాలో మంచి పేరు ఉంది. 2019లో సర్పంచ్‌గా గెలిచిన తర్వాత ఏటా గిరిజనులకే కాకుండా ఆటల్లో, చదువుల్లో మంచి ప్రతిభ చూపుతున్న పిల్లలకు నగదు నజరానాలు ప్రకటించారు. ఆడపిల్లలు పుడితే ఆరోగ్య కిట్ అందజేస్తున్నారు. అనేక కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు.


గిరిజన ఆడపిల్ల వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సురేఖ

లక్ష్మీనగరం.. బాపూజీ కలలు సాకారం



పాపన్నపేట(మెదక్): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా నిలుస్తుంది లక్ష్మీనగరం. పారిశుద్ధ్యం పచ్చదనం ప్రాధాన్యాంశాలుగా దోమలు లేని పల్లెగా.. రోగం లేని ముల్లెగా ప్రశంస అందుకుంటున్న ఈ గ్రామం. 2020 ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైంది. వాటర్ మేనేజ్‌మెంట్ కింద నాటి కలెక్టర్ ధర్మారెడ్డి చేతుల మీదుగా అప్పటి సర్పంచ్ అనురాధ అవార్డు అందుకున్నారు. 921 జనాభా గల గ్రామంలో 473 మంది మహిళలున్నారు. ఇంటింటా కళకళలాడే పూల మొక్కలు కనువిందు చేస్తుంటాయి. ప్రతి జూన్ 2న మొక్కలకు పుట్టిన రోజు వేడుకలు జరపడం ఈ ఊరి ప్రత్యేకత. గ్రామంలో 100 శాతం మరుగుదొడ్ల వినియోగం.. ఇంకుడు గుంతలు.. ఇంటింటికి డ్రైనేజీ.. వీధి వీధికి విద్యుత్ దీపాలతో ఈ పల్లె కళ కళలాడుతోంది. సేంద్రీయ వ్యవసాయం, సంప్రదాయక పంటలు పండిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి మహిళలు అన్ని రకాల వ్యాపారాలు చేస్తూ కుటుంబ పోషణలో అండగా నిలుస్తున్నారు. కోలాటం, భజన లాంటి ఆధ్యాత్మిక చింతనతో శ్రమైక జీవన సౌందర్యపు రుచులు చవిచూస్తున్నారు.

ఎర్రవల్లి.. ఆదర్శవల్లి


ఎర్రవల్లి గ్రామ వ్యూ

మర్కూక్(గజ్వేల్): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఎర్రవల్లిలో కనిపిస్తుంది. అన్ని రంగాల్లో ఆదర్శవల్లిగా గ్రామం నిలిచింది. మిగతా గ్రామాలకు భిన్నంగా.. రాష్ట్రానికే దిక్సూచిగా అభివృద్ధిలో ప్రత్యేకత సంతరించుకుంది. అభివృద్ధి పనులు, స్వచ్ఛ భారత్, సీసీ రోడ్లు, సోలార్ సిస్టమ్, డబుల్ బెడ్‌రూం ఇల్లు తదితర అభివృద్ధి పనుల్లో ముందంజలో ఉంది. మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామంలో సకల సదుపాయాలు కల్పించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో 570 డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇంటింటికి సోలార్ సిస్టమ్ అమర్చారు. 2019–20కి గాను ప్రధాని మోదీ నుంచి స్వచ్ఛ సుందర్ సౌచాల్య అవార్డు దక్కించుకుంది. 2019–20 గాను స్వచ్ఛ సుందర్ సౌచాల్య ఇండివిజల్ కేటగిరిలో నేషనల్ అవార్డు, 2020–21 గాను ఎర్రవల్లిలో 519 కుటుంబాలు సోలార్ వినియోగానికి గాను రాష్ట ఐటీ మంత్రి చేతుల మీదుగా గ్రామ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ పురస్కారం అవార్డు, అభివృద్ధి, స్వచ్ఛతలో మొట్టమొదటగా నిలిచి 2022 ఏప్రిల్ 9న దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ స్వశక్తి కిరణ్ జాతీయ పురస్కారం అవార్డు సైతం దక్కింది.

బురుజుపై 15 ఏళ్లుగా సంబరాలు

తొగుట(దుబ్బాక): నాడు గ్రామ రక్షణ కోసం నిర్మించిన బురుజుపై జాతీయ జెండా ఎగరవేస్తూ గణతంత్ర, స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహిస్తున్నారు. మండలంలోని ఘనపురంలో ఒకప్పుడు గ్రామానికి రక్షణ కవచంగా బురుజు ఉంది. గ్రామం విస్తరించడంతో గ్రామ నడిబొడ్డులోకి చేరింది. పురాతన కట్టడాన్ని భావి తరాలకు అందించాలన్న లక్ష్యంతో శిథిలమవుతున్న అపురూప కట్టడాన్ని గ్రామస్తులు మరమ్మతులు చేయించారు. యేటా జనవరి 26, ఆగస్టు 15న జెండా ఎగరవేస్తూ సంబరాలు నిర్వహిస్తున్నారు.


బురుజుపై జాతీయ జెండా ఎగురవేసిన దృశ్యం

43 ఏళ్లుగా త్రివర్ణం..


రుద్రారంలో త్రివర్ణ పతాకం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో 43 ఏళ్లుగా నిరంతరం త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. గ్రామంలో ప్రతీఒక్కరీలో దేశభక్తిని చాటాలన్న ఉద్దేశంతో గ్రామంలో జాతీయ జెండాను అవనతం చేయకుండా నిరంతరం ఎగరాలని 43 సంవత్సరాల క్రితం గ్రామస్తులు తీర్మానించారు. నాటి నుంచి నేటి వరకు జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ తమ దేశ భక్తిని చాటుకుంటున్నారు. గ్రామ ప్రధాన కూడలిలో 24 అడుగుల నిటారు రాయిపై ప్రత్యేక కర్రను ఏర్పాటు చేసి జాతీయ జెండాను ఎగుర వేస్తున్నారు. ఆగస్టు 15, జనవరి 26న గ్రామంలో జాతీయ జెండాను ప్రభుత్వ అధికారులు ఎగుర వేస్తున్నారు.

ఆర్మీలో మాచవరం యువత

మెదక్‌జోన్: జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో మాచవరం గ్రామం ఉంది. అక్షరాస్యతతో పాటు చైతన్యం నింపుకున్న ఊరులో ఉంటున్న యువతకు దేశ భక్తి కాస్త ఎక్కువే. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కొందరైతే.. దేశ సేవలో భాగస్వామ్యం కావాలనే తపన మరికొందరిది. అందులో భాగంగానే ఆర్మీలో చేరేందుకు యువకులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి 11 మంది ఆర్మీలో చేరగా ఇందులో 9 మంది రిటైర్ అయ్యారు. ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. విశ్రాంత సైనికులు.. యువకులు ఆర్మీ వైపు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు.

సైనిక కుటుంబసభ్యులకు సన్మానం

నంగునూరు(సిద్దిపేట): సైన్యంలో సైనికులు పనిచేస్తుండగా.. వారి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ సైనికుడు, బీజేపీ ఆర్మీ సెల్ కన్వీనర్ నీల చంద్రం ఆధ్వర్యంలో సన్మానించారు. మగ్దుంపూర్‌కు చెందిన జాప స్వామి, బత్తుల శ్రీకాంత్, శ్రీనివాస్, ఉగ్గి తిరుపతి సైన్యంలో వివిధ హోదాలో పని చేస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు జాప అయిలయ్య, బుచ్చమ్మ, బత్తుల యాదయ్య, ఊర్మిళ, ఉగ్గి తారమ్మలను సన్మానించారు.


సైనికుల కుటుంబాలకు సన్మానం

కార్గిల్ వీరుడికి నివాళి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో రైతు కుటుంబం యాదిరెడ్డి–రంగమ్మల కుమారుడు పిన్నింటి చంద్రారెడ్డి దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరారు. పూంచ్ సెక్టర్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఇండియా–పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో సెప్టెంబర్ 19, 2002లో వీరమరణం పొందారు. దీంతో గ్రామ కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి యేటా సెపెంబర్ 18న విగ్రహం వద్ద నివాళులర్పిస్తారు.


చంద్రారెడ్డి

వీరుడికి విగ్రహం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాజుతండాకు చెందిన గుగులోతు నరసింహనాయక్ సైనంలో పని చేస్తూ 2014లో సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం చెందారు. తండ్రి గుగులోతు లింగయ్య–సత్తమ్మ తమ పొలంలో కొడుకు విగ్రహాన్ని కట్టించారు. రాజుతండా మీదుగా పంజాగుట్టతండా వరకు సుమారుగా 2 కిలో మీటర్ల దూరం వరకు జవాన్ పేరిట రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. నరసింహనాయక్‌కు ముగ్గురు సోదరీమణులున్నారు. ఏటా రాఖీ పండుగ రోజు విగ్రహానికి రాఖీ కడుతారు. అలాగే ఆగస్టు 15, జనవరి 26న విగ్రహం ఎదుట జాతీయ జెండాను తల్లిదండ్రులు ఎగరవేస్తున్నారు.


జవాన్ నరసింహనాయక్ విగ్రహం వద్ద తల్లిదండ్రులు

ఏడాది పొడవునా మువ్వన్నెల రెపరెపలు

చిన్నశంకరంపేట(మెదక్): స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేసి సాయంత్రం దించుతారు. స్వాతంత్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు నార్సింగి మండలం శేరిపల్లిలో మాత్రం రెండు చోట్ల ఎగురవేసిన జాతీయ జెండాను ఏడాది పొడువునా ఉంచుతారు. గ్రామంలోని బురుజుపై, గ్రామ చావిడి(కచీర్) వద్ద జాతీయ జెండా ఎగురవేసి ఏడాది పొడువునా అలాగే ఉంచడం ఆనవాయితీగా వస్తుంది. రాజుల కాలం నాటి బురుజుపై నేటికి జెండా రెపరెపలాడుతోంది.


శేరిపల్లిలో బురుజుపై జాతీయ జెండా

రూ.25లకే జాతీయ జెండా

హుస్నాబాద్: స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ హర్ ఘర్ తిరంగా పిలుపులో భాగంగా బుధవారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో పోస్టల్ అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పంపిన ఉత్తరాన్ని మంత్రి ప్రభాకర్‌కు కరీంనగర్ సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ అందజేశారు. ప్రతి పోస్టాఫీస్‌లో రూ.25లకే జాతీయ జెండాను ప్రజలకు అందుబాటులో ఉంచారు.


జాతీయ జెండాతో మంత్రి ప్రభాకర్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA,B.Sc(Agri), 10th, Inter, B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339 (HA-2389)

WANTED

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 (H-796266)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.